
# అంబేద్కర్ దృష్టిలో ప్రజాస్వామ్యం



- కె. బాలగోపాల్

**రాజ్యాంగంలో ఆర్టికల్ 16 క్లాజు4 ప్రభుత్వ సర్వీసుల్లో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు అనేది మనకు కనిపిస్తుంది. చాలామంది దీనిని ప్రభుత్వ ఉద్యోగాలలో అందరికీ సమానహక్కు ఉండాలి. సామాజిక వెనుకబాటుతనం వల్ల పొందలేకపోయిన వారికి రిజర్వేషన్లు కల్పించాలన్న అర్థంలో తీసుకుంటున్నారు. "అంబేద్కర్ ఉద్దేశించింది మాత్రం అందరికీ ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం ఉండాలి, అది ఒక హక్కు అని భావించారు.**


దేశ పరిపాలన ప్రజాస్వామికంగా జరగాలి, సాంఘిక న్యాయానికి తగినట్టుగా జరగాలి, బడుగు వర్గాలు ముఖ్యంగా దళితుల యొక్క యోగక్షేమాలు దృష్టిలో పెట్టుకుని జరగాలి అని భావించారు. పాలనారంగంలో ఎవరు ఉంటారు" అని అంబేద్కర్ ఆలోచించారు. పరిపాలనా రంగంలో అంతా బ్రాహ్మణులు, అగ్ర వర్ణాలవారూ ఉంటే రాజ్యాంగంలో ఎన్ని రాసుకున్నా చట్టాలు ఎన్ని చేసుకున్నా అవి అమలుకావు. దళితులకు న్యాయం జరగదన్నారు. పాలనను ప్రజాస్వామీ కరించాలని, అధికార యంత్రాంగంలో దళిత వర్గాలకు చోటు కల్పించాలని పేర్కొన్నారు. ఇవాళ ఎక్కువ భాగం కోర్టులైనా బయట జరిగే చర్చలైనా పాలనా యంత్రాంగాన్ని ప్రజాస్వామీకరించాలన్న అంశాన్ని మర్చిపోయి చివరకి ఉద్యోగ హక్కులో రిజర్వేషన్లు అని చూస్తున్నారు. ఈ స్పృహతోనే పదే పదే రిజర్వేషన్లకు ముఖ్యంగా ఒబిసి రిజర్వేషన్లకు సుప్రీం కోర్టు అడ్డం పడుతున్నది. అసలు సుప్రీం కోర్టు నిర్మాణమే అప్రజాస్వామికంగా ఉంది. ఆ సుప్రీం కోర్టులో ఎప్పుడూ ఒక రకమైన రాజకీయ ఆచారంగా గత 20 సంవత్సరాలుగా ఒక దళితుడ్ని, ఒక ఆదివాసిని, ఒకరో ఇద్దరో స్త్రీలను జడ్జిలుగా నియమిస్తున్నారు. కానీ సుప్రీం కోర్టులో గానీ హైకోర్టులో గానీ దళితులకూ ఆదివాసీలకూ స్త్రీలు మైనారిటీలకు తప్పని సరిగా తగిన ప్రాతినిధ్యం ఉండాలన్నటువంటి చట్టం గానీ రాజ్యాంగ పరమైనటు వంటి ఆదేశం గానీ లేదు. సుప్రీం కోర్టుతో సహా అన్ని కోర్టుల్లో అగ్రవర్ణాలకు చెందిన పురుషులే జడ్జిలుగా ఉంటున్నారు. ఇది ఆ వ్యవస్థ యెక్క స్వభావాన్ని చాలా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఈ రోజు న్యాయవ్యస్థలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని అడుగుతున్నారు. అంటే ఇది కేవలం ఉద్యోగ హక్కు అనే కోణం నుంచి చూస్తే పూర్తిగా అర్థం కాదు. ఉద్యోగ హక్కు తప్పని సరిగా సమానంగా ఉండాలి. అది మాత్రమే కాకుండా పాలనా యంత్రాంగం, న్యాయ వ్యవస్థ తాము ప్రజాస్వామికంగా వ్యవహరించాలంటే దాని మౌళిక స్వభావం కూడా మారాలి. కేవలం అది అగ్రవర్ణాల పురుషుల యెక్క వ్యవస్థలుగా ఉన్నంత కాలం అవి ప్రజాస్వామికంగా ఉండలేవు. ప్రజాస్వామిక ఆదర్శాలు సక్రమంగా అమలు చెయ్యాలన్న అంబేద్కర్ ఆలోచనలలో గల ప్రముఖమైన ఈ కోణాన్ని మర్చిపోయి ఉద్యోగ రిజర్వేషన్లు అంటే అది ఉద్యోగ హక్కు అనే పాక్షికోణమే చూడడం జరుగుతుంది. దీనిని సవరించుకోవడం చాలా అవసరం.

ప్రజాస్వామ్యభావన గురించి పాశ్చాత్య దేశాలలో చాల చర్చ జరిగినటు వంటి భావన. ఎక్కువ భాగం పరిపాలనా యంత్రాగాన్ని అంటే ప్రభుత్వాన్ని ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకోవాలి. ఆ ప్రభుత్వం చట్ట బద్దంగా పరిపాలించాలి. ఆ చట్టాలు ప్రజలయెక్క ప్రాథమిక హక్కులకు లోబడి ఉండాలి. ఈ మూడు లక్షణాలు ప్రజాస్వామ్యాన్ని నిర్వచిస్తాయని అనుకోవడం జరుగుతుంది. వీటికి అంబేద్కర్ మరోటి చేర్చారు. ఆయన సమాజంలో అధికారాన్ని తన చేతులో పెట్టుకున్న గవర్నింగ్ క్లాస్ అనేది ఉండకూడదన్నారు. గవర్నింగ్ క్లాస్ అంటే తెలుగులో పాలక వర్గం అని అనువదించుకోవచ్చు. కానీ మార్క్సిజం ప్రభావం వల్ల పాలక వర్గం అంటే దానికి ఒక అర్థం వచ్చింది. అది రాజకీయ ఆర్థిక వ్యవస్థలలో పైన ఉన్న వర్గాన్ని పాలక వర్గం అని అంటున్నాము. అంబేద్కర్ ఆ అర్థంలో గవర్నింగ్ క్లాస్ అనేది వాడలేదు. పాలనలో ఒక సామాజిక వర్గం అధికారాన్ని చలాయిస్తుందో అదే గవర్నింగ్ క్లాస్ అన్నారు. అంటే వంశపారపర్యంగా ఒక తరం నుండి మరో తరానికి ఆ సామాజిక వర్గమే పరిపాలనలోనూ అధికార యంత్రాంగంలోనూ ఉంటుదని దీనినే అంబేద్కర్ గవర్నింగ్ క్లాస్అని చెప్పారు. వారు ఎన్నికల ద్వారా చట్ట ప్రకారమే ఎన్నికయ్యి పరిపాలన చేస్తున్నా ఆ చట్టాలు ప్రాథమిక హక్కులకు లోబడి ఉన్నా అది ప్రజాస్వామ్యం కాదన్నారు. అది ఒక వర్గం

యెక్క పాలనే అని పేర్కొన్నారు. ఆ రోజుల్లో ఆయన బ్రాహ్మణులను ఉద్దేశించి ఈ మాట వాడారు.

భారత దేశంలో స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటీషువాళ్లతో బ్రాహ్మణులు అధికారాన్ని పంచుకుని వారే ఉపయోగించుకున్నారు. వారు చట్టప్రకారమే ఎన్నికవుతూ అధికారాన్ని పొందుతున్నప్పటికీ అది ప్రజాస్వామ్యం కాదు. ఈ గవర్నింగ్ క్లాస్ అనేది పోవాలని, సమాజంలో అన్ని పార్శ్వాల నుంచి ప్రజలు పాలనలో భాగం కావాలని అంబేద్కర్ పేర్కొన్నారు. కానీ ఈనాడు సమాజంలో గవర్నింగ్ క్లాస్ పోలేదు. ఈవాళ ఒక్క బ్రాహ్మణులే కాక అగ్రకులాల వారు, అనుత్పాదక, ఆర్థిక రంగాలలో ఉన్న వారు సివిల్ కాంట్రాక్టర్లు, షేర్ బ్రోకర్లు, రియల్ ఎస్టేట్ డీలర్లు, కమీషన్ ఏజెంట్లు ఇటువంటి వారి వర్గం ఒకటి సమాజంలో ఉంది. ఈ వర్గమే పదేపదే ఎన్నికవుతూ ఉంది. ఇది ఒక గవర్నింగ్ క్లాస్‌గా భారత దేశంలో స్థిరపడి పోయింది. దీనిని తొలగించనంత కాలం ప్రజాస్వామ్యమన్నదానికి అర్థం లేదని అంబేద్కర్ భావించారు. మనకు ఎన్నికలు ఉన్నాయి. చట్టపరిపాలన నడుస్తున్నది. ఆ చట్టాలు ప్రాథమిక హక్కులకు లోబడి ఉన్నాయి అయినా ఈ గవర్నింగ్ క్లాస్ పదేపదే అధికారంలో ఉంటుండం వల్ల ప్రజాస్వామిక అసంపూర్ణతను చూచిస్తున్న దన్న కోణం నుండి చూడడం అవసరం.

అంబేద్కర్ కులవ్యవస్థను, మనుధర్మాన్ని విడనాడండి అని చెప్పింది దళితుల కోసం కాదు హిందువుల కోసమే. ఇక్కడ ఆయన దళితులకు ఇచ్చిన సందేశం మీరు హైందవ మతంలో అంతర్భాగంగా ఉండి ఆ భావజాలంపై పోరాటం చెయ్యడం అవసరం అని. దళితులు హిందువులు కారు. వారు తమని తాము హిందూ మతంలో భాగంగా చూసుకోనవసరంలేదని చెప్పారు. హిందూ సమాజం కాళ్ళకింద చెప్పుల కింద ఉన్నటువంటి దళితులు బయటికి రావాలని పిలుపు నిచ్చారు. చివరకు ఆయన బౌద్ధం తీసుకున్నారు. హైందవ సమాజాన్ని సంస్కరించాలి, బాగుచెయ్యాలి, విప్లవీకరించు కోవాలి అని చెప్పింది హిందువుల కోసమే అని గ్రహించాలి. మీరు నాగరీకులుగా ఉండదలుచుకుంటే, మీరు ఆత్మగౌరవంతో బ్రతక దలుచుకుంటే మిమ్మల్ని మీరు నాగరీకులుగా చెప్పుకోదలుచుకుంటే మీ సమాజాన్ని ప్రజాస్వామీకరించుకోవడం మీకు అవసరం అని హిందువులకు చెప్పారు. దళితులు వేరేమతం తీసుకున్నా కూడా హైందవ కులవ్యవస్థ చెప్పుల కింద ఉండడం జరుగుతున్నది కాబట్టి వాళ్ళ కోసం కూడా అవసరమే అని ఆయన మాట్లాడారు. ఆప్రయత్నంలో భాగంగానే ఆయన హిందూకోడ్ బిల్లు రూపంలో తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ అది సాగలేదు.



రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్ అంబేద్కర్‌తో కమిటీ సభ్యులు

సమాజంలో కుల వ్యవస్థ ఉన్నంత కాలం ప్రజాస్వామ్యం సాధ్యం కాదని అంటారు. ఎందుకంటే ప్రజాస్వామ్యానికి మూలకరణమైన ఆలోచన ఏమిటంటే ప్రజల మధ్య పరస్పర సంభాషణ, సంవాదం ఉండడం ద్వారా వారు ఒక అభిప్రాయానికి వస్తారు. ఆ అభిప్రాయం ప్రకారం పార్టీలను ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. ఆ సంవాదానికి కులం అడ్డుగోడగా నిలుస్తుందన్నారు. కులం కారణంగా విడిపోయి ఒకరితోనొకరు సంభాషించుకోలేక చర్చించుకోలేక భావ స్పందనలు కూడా పెట్టుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు ప్రజాస్వామిక అభిప్రాయం అనేది ఉండదు. వివిధ కులాల అభిప్రాయాలే ఉంటాయి ప్రజాభిప్రాయం అనేది లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే లేదన్నారు. ఈవాళ చాలామంది అనేక కారణాల వల్ల దళిత నాయకులతో సయితం ఎత్తుగడల రీత్యా హిందువులతో మమేకం కావచ్చు అనే ఆలోచనలు చేస్తున్నారు. ఇది చాలా నష్టదాయకం అన్యాయమైనది.

దీనికి ఉదాహరణే మయావతి. అంబేద్కర్ కనుక బ్రతికి ఉంటే ఒక్క క్షణం కూడా మాయావతి రాజకీయాలను సమర్థించరు. హిందూత్వం అనేది చాలా ప్రాథమికంగా మౌళికంగా అమానుషమైనది దాంతో ఎత్తుగడల రీత్యా ఐక్య సంఘటల ద్వారా కలసి పని చెయ్యడం ఎత్తుగడల రీత్యా హిందూత్వాన్ని వాడుకోవడం అనేవి ఆయన ఆలోచనా రీతికే వ్యతిరేకమైనవి, భిన్నమైనవి అనేది మనం తీసుకోవాల్సిన అవసరం ఉంది.